శ్రీ ఏ. వి. స. మూర్తి

మరల మధ్య మందారం

నేను సౌందర్యోపాసకుడినట. తను ఉంటున్న ప్రదేశం ప్రకృతి అందానికి ఆలవాలమట. ఓ మారు వచ్చి నాల్గు రోజులుండి చూచిపోవాలిట. మాధవ వ్రాసాడు. అది చదువుతుంటే ఎవరో నా వీపుమీద చరిచినట్లయింది. నన్ను చూస్తూ వెకిలిగా నవ్వుతూ "నువ్వేనోయ్! సౌందర్యోపాసకుడివి" అంటున్నట్లయింది.

కుర్చీలో జారబడి చూట్టూ చూసాను.

పిల్లలిద్దరూ ఏడుస్తున్నారు. అప్పుడే వాళ్ళని బాదాను. పాతబడిన యింటి పైకప్పులోంచి బూజులు వేలాడు తున్నాయి. ఆ గది నా వాటాలో ముఖ్యాంగం. సన్నపాటి వరండాని రెండు ముక్కలు చేసి ఓ భాగానికి వంట గది అనీ; మరో భాగానికి బాత్రూం అనీ అన్నారు. వెనక ఆట్టు గోడను ఆనుకుని ఉన్న వీధిలో పాకీ బుట్టల వరసలున్నాయి. వాటి సువాసన యధేచ్ఛగా గాలిలో కలుస్తోంది. రోడ్డు వయిపు నుంచి పరుగులు తీస్తున్నాయి బస్సులు! లారీలు! రిక్షాలు! ఆ అరుపులకి తోడు నా ఆవిడ బాత్రూంలో అంట్లుతోముతూ కర్ణ కఠోరంగా సమస్త ప్రపంచాన్నీ విసుక్కొంటోంది. అలసటగా ఉంది. ఆమె యింకా కాఫీ తేలేదు. అలాంటి పరిస్థితిలో పిల్లవాళ్ళ చేతిలో నలుగుతూన్న ఉత్తరం అందింది.

కళ్ళు మూసుకున్నాను. హైమ...ఎదురుగా నిలిచినట్టయింది. ఆమె కోసం నేను సౌందర్యోపాసకుడినయానో; సౌందర్యోపాసకుడిని అయి ఉండటం వల్లనే ఆమె పరిచయ భాగ్యం లభించిందో ఎప్పటికీ తేలని సమస్య — ఏమో మరి! ఆ రోజుల్లో ఏ కొండను చూసినా నా కోసమే అలా వంపులు తిరిగిపోతూ నీలాకాశం వయిపు సాగిపోతున్నట్లు కనుపించేది. ఎక్కడ వెలుగు నీడలు చూసినా ఆ సృష్టి అల్లిక నా కోసమే! ఏదో తనివితీరని దాహంతో ప్రతి పువ్వు వయిపూ, ప్రతి గడ్డిపరక వయిపూ చూపులు పరుగులెత్తేవి. ఎవరా అందాలను చూసినా, పట్టించుకొన్నా వాళ్ళు నా వాళ్ళే! నా ఆత్మీయులే!

హైమ వెన్నెలను చూస్తూ మైమరిచేది. మంచులో తడిసిపోతూ పరవశించేది. ఎప్పుడూ ఆ గంధం చెట్లదగ్గర... ఆ సెలయేటి దగ్గరా ... మామిడి కొమ్మల మీదా ... ఎక్కడని చెప్పటం? ప్రతి అందం చూస్తూ, ప్రతి పక్షినీ అనుసరించి గెంతుతూ కూస్తూ ఉండేది. యిప్పటికీ అరవిచ్చిన మందారంలోని ఎరుపూ; దట్టంగా అలముకున్న మబ్బుల మధ్య నుంచి సాగివచ్చే మెరుపూ ఆమె పెదాలనూ, వాటి మధ్య చిరునవ్వుల కాంతినీ గుర్తు చేస్తూనే ఉంటాయి.

ఏమిటో పిచ్చి! ఏవో కబుర్లు! అంతూదరీలేని విషయాలు! అలాంటప్పుడు ఏమీ మాట్లాడకుండా ఆ పెదాలనూ, కళ్ళనూ చూస్తూ కూర్చోవాలనిపించేది. అయితే ఆలోచనలు ఊరుకొనేవి కావు! చూచే అనుభవం నుంచి ఎడం చేసేవి హృదయాన్ని.

అలాగని చూడటం మానివేసేవాణ్ణా?! కొంచెం దూరమైతే చాలు పరుగెత్తే వాణ్ణి. వెదికే వాణ్ణి! నిరాసలేని ఆకాంక్షతో! తరుగుతేని ఉత్సాహంతో! ఏ చెట్టు కొమ్మల్లోనో కనుపించేది! అస్తమించే సూర్యుడినో; ఉదయించే చంద్రుడినో చూస్తుండేది. పదాలు లేని భాషలో మౌన కవిత్వం లిఖిస్తున్న మహాకవిలా అగుపించేది. సమీపిస్తున్నకొద్దీ పాదాలకు వేగం తగ్గిపోయేది!

ఎంత సుందర దృశ్యం! అనుక్షణమూ మార్పులకూ లోనయే సౌందర్య సముదాయ సృష్టి అయితేనేం? ప్రతి ఒక మార్పూ హృదయాన్ని కదిలిస్తుంది. ప్రతి ఒక వర్ణమూ ఉత్తేజం కలిగిస్తుంది. అలాగే మార్పులకు లోనయే ఆమె ఆ అస్తమయ సూర్యకాంతిలో సృష్టి — సౌందర్య దేవతకు దిద్దిన తిలకంలా మనసు కదిలించి ఉత్తేజ పరిచేది.

ఈనాడు యీ మరల మధ్య మోటారు కార్లు రేపే ధూళి మధ్య; ఫ్యాక్టరీలు విసర్జించే మలినాల మధ్య; వాటి వాసనల మధ్య...హృదయ సంబంధం లేని జీవితం గడుపుతున్న నాలో శిధిలమయిపోయిన సౌందర్య వీక్షణా కాంక్ష చివురు లెత్తి; మొగ్గ తొడిగి; ఫలప్రదం కావటం జరిగే పనేనా?

యీ జీవితం గూర్చి, యీనాటి నా స్థితి గూర్చి ఒక్క సెకను నిదానంగా పరిశీలించుకోటానికే అవకాశమీయనంత వేగంతో సాగిపోయే కాలం, ఆగిపోయే సౌందర్యం; హృదయం; స్పందన వంటి పదాలకు తిరిగి తావీయగలుగుతుందా??

ఆనాడు ఆ కొండలకూ; ఆ పచ్చికకూ; ఆ సెలయేటి యిసకకూ; గులకరాళ్ళ చప్పుడుకూ శాశ్వతంగా అంకితమయిపోవాలనుకున్న ఆకాంక్ష ఏమయిపోయింది? ఏ పరిస్థితుల మధ్య నాశనమయిపోయింది??

బి. యే. పూర్తయింది. అందుకో ఉద్యోగం కూడా దొరికింది. స్కూలూ కాలేజీ మెట్లమీద ఎక్కి ఒకరకమయిన క్రమశిక్షణా స్వేచ్ఛకూ అలవాటయిన బ్రతుకులోంచి ఒక్కమారుగా మరో రకమయిన క్రమశిక్షణకూ, స్వేచ్ఛకూ ఆలవాలమయిన ఔద్యోగిక జీవితంలోకి విసిరివేయబడ్డాను. కాలేజీ మెట్లమీద ఏర్పడిన ఆశయాలూ; ఆనందాలకర్థాలూ నెరవేర్చుకోటానికి కావలసిన స్వేచ్ఛ లభించిందనే సంభ్రమంతో ఆ కొండల్లోకి

పరుగెత్తాను. కాని, ఇప్పటికే అరుణోదయ స్పర్శతో విడిపోతున్న మంచు తెరల్లా వయో ప్రభావంతో ఊహల తెరలు తొలగిపోయి వింత వింత కోరికలు బయల్పడేవి

ఆ వూరు కొండల మధ్య ఉండేది. సముద్రమట్టానికి బాగా ఎత్తున ఉండేది. ఎప్పుడూ చల్లని గాలి; ఎప్పుడొస్తాయో తెలియని వానలు. ఎక్కడ చూసినా రమణీయ దృశ్యాలు. చదువు చెప్పటం నా వృత్తి అయినా సృష్టిని చదువుకోవటమే వ్యావృత్తి అయింది.

హైమ ఆ వూళ్ళోనే కనిపించింది. మొదటిసారి చూసినప్పుడు మరోసారి చూడాలనిపించింది. మరోసారిచూసాక యింకోసారి! యింకోసారి చూసాక...ఎప్పుడూ తెలుసున్నదే అయినట్లూ; ఎప్పుడో తెలుసుకోవాల్సిందయినట్లూ తోచేది. అలా చూస్తూ చూస్తూ ... 'చూడకుండా ఉండలేనింక' అని నిర్ణయించుకున్నాక...అనుకున్నాను.

''సృష్టీ ! నాకు జన్మలభించింది. కనులు లభించాయి ! మనసు లభించింది. అన్నీ నీవే ప్రసాదించావు. వీటి నన్నింటినీ ఒంటరిగా ఉంచలేకనా ఈ ఆకాంక్షనూ; యీ మధుర మూర్తి దర్శన భాగ్యాన్నీ ప్రసాదించావ్ !''

సృష్టి తనగాలి గొంతు విప్పి మనోహరంగా సవ్వడి చేస్తూ వూల వాసనలతో నా యింద్రియాలను మేల్కొల్పుతూ 'అవున'న్నట్లు సమాధానమిచ్చేది.

తీర్చి దిద్దిన శారీరక సౌందర్యమా ? సుకుమారంగా చిన్నపిల్లలా ప్రవర్తించే లాలిత్యమా ? ఆ ప్రకృతిలో కలిసిపోయి పరవశించి పోగలిగిన మనస్తత్వమా ? ఏది హైమలో నన్నాకర్షించినది ?

ఎప్పుడూ కురిసే వానలూ! చిత్తడి చిత్తడిగా ఉండే నేలా! మలేరియా జ్వరం! జంతు భయం! కులాసాగా తిరిగే పాముల సంతానాలూ! అక్కడకు చేరుకున్న మాస్టర్లందరూ ఎందుకు వచ్చాంరా! దేవుడా! అని బాధపడేవాళ్ళే! అది పనిష్మెంటు ఏరియాట! ఎవరెవరు ఏయే విధాలుగా ట్రాన్స్‌ఫర్ చేయబడ్డారో చెప్పుకుంటూంటే విసుగనిపించేది. వాళ్ళతో కలియలేక పోయేవాణ్ణి! జీతాలు సక్రమంగా అందక వాళ్ళు యిబ్బందులకు లోనయి అస్తమానూ డబ్బు గురించే మాట్లాడుకొనేవాళ్ళు. సృష్టి అందాలకు ఆనందించలేని వాళ్ళమీద చులకన భావం ఉండేది నాలో! వాస్తవిక జీవితంలో ఆ గొడవల వెనుక ఎంత దారుణమయిన విచక్షణా రహితమయిన అధికార దుర్వినియోగం ధన మదాంధత ఉన్నాయో! ఈరోజు యీ మరల మధ్య యిలా [illegible]క్కుకోటాన్కి కారణం కొంతవరకూ అదేనేమో ?!?

ఆ కొండల మధ్య అయ్యరు కాఫీకొట్లో చాలా మంచి టీ దొరికేది. హైమ అయ్యరు కూతురు. తల్లిలేని పిల్లను తీసుకొని అక్కడికి వచ్చేసాడు తండ్రి. చిన్నతనం నుంచి మూగదానిలా ఎవరితోనూ మాట్లాడేది కాదుట. ఎప్పుడో పోయిన తల్లి రూపం ఎలా ఉండేదా అని ఆలోచిస్తూ ఉండేదేమో! తండ్రి తల్లి గురించి అప్పుడప్పుడు చెప్పే మాటలను మననం చేసుకుంటూ; విశాల గగనాన్నీ, గంధం చెట్లనూ చూస్తూ—ఆమె పెద్ద పెద్ద కళ్ళనూ, మేని ఛాయనూ లెక్కలు కట్టేదేమో! ఎప్పుడూ వచ్చిపోయే మనుషుల మధ్య వ్యాపారం చేసుకునేవాడు తండ్రి. ఆమెను ఖాతరు చెయ్యటానికిగాని... ఆమె ఖాతరు చెయ్యటానికిగాని ఎవరూ లేరు. బహుశా అందువల్లనే ఆమె ఒంటరిదయింది. ఆ ఒంటరితనమే ఆమెకు ప్రకృతితో జంట కుదిర్చింది. అయ్యరు దుకాణం పెంకుటిల్లయేసరికి ఆమె మనసు చిన్న కుటీరంలా మారిపోయింది. అందులో ఏముందో పట్టించుకోటానికి వీల్లేకుండా పూర్తిగా ద్వారాలు మూతబడిపోయాయి.

అక్కడ టీ తాగినపుడల్లా ఆ అయ్యరు ఆమెకు తండ్రి కావటం వల్లనే అంత మధురంగా టీ పెట్టగలుగుతున్నాడనిపించేది. మనసు చేసే ఆలోచనలకు అర్థం ఉండదని నవ్వుకొనేవాణ్ణి.

స్కూల్లో పాఠాలు ముగించుకుని యింటికి చేరేసరికి భూతం లాంటి పెద్ద క్వార్టరు! 'నువ్వు ఒంటరి వాడవోయ్!' అంటున్నట్లు గోడలూ! అస్తవ్యస్తంగా పడున్న బట్టలు! పుస్తకాలు! నీళ్ళుండని కూజా. గబగబా బట్టలు మార్చుకొని అయ్యరుకొట్టుకు పరుగెత్తేవాణ్ణి.

ఆమె ఉండదక్కడ. తెలుసుండీ వెళ్తాను. నిన్నమధ్యాహ్నం కదిలిపోయిన మేఘం కోసం నేడదే ప్రదేశంలో వెదకటం ఎంత తెలివి తక్కువ! వ్యక్తులను వాళ్ళ గృహాలను బట్టి వెతుక్కుంటారు జనం! వాళ్ళ ప్రవృత్తిని బట్టి వెతక గలిగితే ఏ మనిషినీ కోల్పోవడం; చూడకపోవటం జరగదు. అయితే ఆ నేర్పు ఎంతటివారికి!

ఎన్ని పువ్వులు! ఎన్ని ఆకులు! ఎంత యిసుక! ఎంత పొడవైన సెలయేరు! ఎన్ని గులకరాళ్ళు! ఎన్ని కొండలు! చెట్లు! ఎక్కడని వెదకను ? ఎన్నింటినని అడగను ? బదులివ్వటం చేతకాని వాటిని ప్రశ్నిస్తూ వెతుక్కునేవాణ్ణి. అవి యిచ్చే బదులును అర్థం చేసుకోలేని తెలివి తేటలతో ప్రశ్నించేవాడిని. ఎక్కడయినా పొరపాటున వెదకటం మానేస్తానేమో! ప్రతి దాన్నీ గుర్తు చేసుకునే వాడిని. తిరిగినచోటే తిరిగేవాణ్ణి! అప్పుడప్పుడు నాయత్నం ఫలించేది.

యిప్పపూలను కుప్పగాపోసి ఆటలాడుతుండేది. సూర్యుని చివరి వెలుగుల్లో మెరిసిపోయేవి ఆమె కనులు! మోము! తడి యిసకను గుప్పిట్లోకి తీసుకొని ఈ చేతిలోంచి ఆ చేతిలోకి పోసుకుంటూ, రాళ్ళమీద కూర్చుని, కాళ్ళతో నీటిని కదిలిస్తూ ఉండేది. పచ్చని పాదాలు స్వచ్ఛమయిన నీటి అడుగున చేప పిల్లల్లా కదులుతూ ఉండేవి. ఆవేళ్ళు పరిశుభ్రమయిన నీటితో కడిగిన పచ్చల్లా ఉండేవి.

సృష్టిలో విడదీయలేని ఒక భాగంలా ఉండేది హైమ. సృష్టి తన సౌందర్య దాహమంతా ఆమెలో తీర్చుకుందా అన్న

సందేహం ఏర్పడేది. ఎలా పరిచయం మొదలయిందో స్పష్టంగా చెప్పలేనుగాని...నేను కూడా తనలాగే ఈ అందాలపట్ల శ్రద్ధగల వాడిననిపించటం వల్లనేమో/ ... తనలో తనకు కలిగే ఆనందాన్ని నాతో పంచుకోటం ప్రారంభించేది.

"చూడు చూడు! ఆ పావురం! అబ్బా! ఎంతలా ఎగురుతోందో! మనం కూడా అలా ఎగరగలిగితే బలే! బలే వుంటుంది కదూ! అరరే! చూడు! ఆ మబ్బుదాకా ... ఆ! ఆ! దాన్ని ముట్టుకుంటుందని పందెం! ఏదీ? కనిపించటం లేదే...నీక్కనిపిస్తోందా? అక్కణ్ణించి కనిపిస్తోందా ... ?" వింత ఉత్సాహం! వింత నిరాశ! ఆ కళ్ళతో దోబూచులాడేవి.

"వర్షంలో తడిసి వణికి పోతున్న గువ్వలజంట నీ కళ్లలో దర్శన మిస్తోంది హైమా"! అనాలనిపించేది.

"బలే బావుందేం! ఈ యిసకలో నడుస్తుంటే!" అనేది.

"నీకెలా వుంది?" ప్రశ్నించేది.

"పాపం! ఈ చిన్ని ముండలు పడిపోయాయి! వాళ్ళమ్మ ఎప్పుడొస్తుందో?" గూళ్ళు సరిచెయ్యటానికి చెట్టెక్కేది.

కోకిల కూతలను అనుకరించేది. నన్నూ అరవమనేది.

ఎప్పుడయినా ఏ కోతి అయినా మిర్రు మిర్రు మని చూస్తే "దొంగ ముండకు నేనంటేకోపం" అంటూ వెక్కిరించేది.

ఏదో అడిగి, జవాబుకోసం చూచేదే కాదు.

అటువంటప్పుడు ఏదో మహారాణి - అంతకాలమూ .అంతః పుర మర్యాదలలో మగ్గిపోయి ఒక్కమారుగా సంకెళ్ళను తెగదెంచుకుని ప్రపంచంలోకి అడుగు పెట్టి గెంతులేస్తున్నట్లు తోచేది.

ఆమె నాకు పూర్తిగా చేరువయింది. అందుకు ముఖ్యమైన కారణం నాలోని శారీరక వాంఛలను తొందరపడి ప్రదర్శించకపోవటం! ఆమె కంటికి పురుషులంతా ఎలా కనుపించేవారో ... ఆమె మనసుకు ఎలా అర్థమయేవారో...అలా కనుపించకపోవటం! అనిపించకపోవటం! ఆమెలో పురివిప్పి నాట్యమాడే సృష్టికి సంబంధించిన వీక్షణాలాలన—నాలో కూడా ఉందవో; నాలోనే ఉందనో — ఆమెకు అనిపించేలా చేయగలిగాను. మూసుకున్న ఆమె హృదయ కుటీర ద్వారాలు తెరువబడి నాకు ప్రవేశం లభించింది.

ఒకమారు ఆమెలో స్థానం లభించాక; నా బెల్లింపులకూ, చిన్న చిన్న బెదిరింపులకూ, బతిమలాటలకూ ఆమె లొంగిపోవటం మొదలయింది. పువ్వులనీ, మబ్బులనీ వర్ణించిన నోరు కనులనీ పెదాలనీ వర్ణించింది. వాటిని వర్ణించుతూనే తాకగలిగింది. నా పెదాలు ఆ కళ్ళనుంచి పెదాల నుంచి ప్రారంభించిన ప్రయాణం చాలా చాలా దూరం సాగిపోయింది. ఆమెను ఏ బంధాలూ ... ఏ నియమాలూ నా వద్దకు రాకుండా ఆపలేకపోయాయి. దొరికిన కొద్దీ కావాలనీ; కావలసినదంతా దాచేసుకోవాలనీ పేరాశ! ఆ సౌందర్యం నా స్వంతం కావటంతో దాన్ని ఎలా రక్షించుకోవాలా అన్న తపన — నాలోని మంచితనానికి రుజువుగా మొలకెత్తింది. ఆ తపన పెరిగి పెద్దదయితే...??

రావుగారి పూర్తి పేరు వీరభద్రరావుగారు. వారి పూర్తి స్వరూపం రాజకీయం. "పెళ్ళాన్ని ప్రేమించడానికీ, ముండ నుంచుకోటానికీ కూడా ఉండాలోయ్ రాజకీయం..." అంటూ సెలవిస్తారట ఆయన. ఆయన మూతిమీద మీసాలూ, ఆ ఒంటిమీద ఖద్దరూ ఆయన అధికారాన్నీ, పలుకుబడినీ జనానికి సైన్ బోర్డుల్లా గుర్తుచేస్తాయి. ఆయన పూసుకొన్న సెంటుల్లో జిల్లా పరిషత్తు ప్రెసిడెంటు గిరీ; గ్రంథాలయాల అధ్యక్ష పదవీ; ప్రజల కష్టాలు ప్రభుత్వంతో నివేదించుకొనే అందమయిన నౌఖరీ వంటి వెన్నెన్నో కలగలిసి పోయాయి. వారు వేసవికాలం ఎండలకు జడుస్తుంటారు. వారి సుమ కోమల దేహరాజం ఆ తాపాన్ని భరించజాలదు. అందుకే ఆ కొండల మధ్యకు వేంచేసి ట్రావెలర్సు బంగ్లాలో వుంటుంటారు. ప్రతి ఏడూ వేసంగుల్లో, 'పర్యవేక్షణ' మిషతో, ప్రభుత్వధనంతో, స్వజనంతో.

వారిని దర్శించటానికి; అవసరమయినవన్నీ అమరించటానికి; ఎవరి బాధలను వారు నివేదించుకోటానికి మాస్టర్లందరూ వెళ్ళేవారు. వారితో కలిసి; వారిలాగే నేనూ అణకువ ప్రదర్శించాను. వారి గొంతులోంచి వచ్చే శబ్దాలకు అక్షరరూపం యివ్వడానికి మా చెవులు శ్రమపడ్డాయి. అందరమూ బయటపడ్డాం! మాలో, అవసరం ఉన్నవాళ్లు ఆయనకు కాకా పట్టడానికి ఎక్కువసార్లు వెళ్ళారు. చందాలు వేసుకుని అందరమూ ఆయనకు సౌకర్యాలు కలిగించాం.

ఆయన సపరివారంగా అయ్యరు టీ కొట్టుకు వెళ్ళేవారు. నిజానికి వారికి వెళ్ళవలసిన అవసరం లేదు. అయ్యరు మరింత ప్రత్యేకంగా గౌరవంతో యిచ్చిన ఉచిత తేనీరు సేవించి...ఆ రుచిని మెచ్చుకుంటూ కాస్త ఎక్కువ కాలమే అక్కడ గడిపేవారు. అక్కడ ఎక్కువ సమయం గడిపే చాలా మందికున్న కారణమే వారినీ అక్కడకు రప్పిస్తోందని గ్రహించటానికి నాకు ఎక్కువ సమయం పట్టలేదు.

ఆరోజు నాకు బాగా గుర్తు. నేను వెళ్ళేసరికి ఎదురుపడిన దృశ్యం···యిప్పటికీ మరువలేను. ఆయన హైమ భుజం మీద చేయివేసి మాట్లాడుతున్నారు. వారు చేయివేసి మాట్లాడుతున్న తీరులో ఒక విధమయిన అధికారం; మాలిమి ఉన్నాయి. ఆమె తల వంచుకుని ఉంది. అయ్యరు ఏదో అంటున్నాడు. ఆయన బొంగురు గొంతుక నా చెవిలో పడింది.

"ఎదిగి పోనాదయ్యా అయ్యరూ! మాంచి ఏపుగా ఎదిగి పోనాది."

అయ్యరు మరింత వినయంతో ముడుచుకుపోయాడు.

ఆ సంభాషణ నేను పూర్తిగా వినలేదు. ఏదో అనుమానం బాధ! నా వస్తువును ఎవరో ఎత్తుకుపోటానికి ఎత్తులు వేస్తున్నట్లు అనిపించింది. నేను గబగబా నడుచుకుంటూ సెలయేటి దగ్గరకు పోయాను.

అనేక ఆలోచనలు!

ఎందుకింత ఆరాటం ? ఏమిటీ దుఃఖం ? ఆ ఆరాటానికి ఆ దుఃఖానికి మూలం ఏమిటి ? హైమ ! హైమను అపార్థం చేసుకున్నాను !

అలా అనిపించీ అనిపించగానే ఆమె కోసం పరిగెత్తాలని పించింది. ఆమె నాకు శ్రమనివ్వలేదు. వస్తూనే–

''కోపం వచ్చిందా ?'' ప్రశ్నించింది. అయితే ఆ ప్రశ్నలో సమాధానం కోసం ఆరాటంలేదు. ఏ అమాయకత్వమూ, ఏ ఒంటరి తనమూ నన్ను ఒకనాడు కదిలించగలిగాయో...అవి... ఉూ పరిచయం యింత దూరం సాగిపోయాక అంతగా కదిలించలేక పోయాయేమో !! అందంతో బాటు పురుష ప్రవృత్తిని తృప్తి పరచగల మేధస్సుతో కూడిన బానిసత్వం...ఆమె నుంచి ఆశించా నేమో !!! ఆలోచించాక నా మనసు నెమ్మదిగా సర్దుకొంది. అలా సర్దుకోవటమే నా గొప్పతనమా ?

రావుగారికి ... పరుగులుతీసే హైమను చూస్తే తన యింట్లో తన అధికారం క్రింద ఉండే కుక్కపిల్ల గుర్తు వచ్చేది కాదనుకుంటాను. ఎవరిదో కుక్కపిల్ల ! అందంగా ఉంది ! తెచ్చు కోవాలి ! ఓ మారు ఆడుకోవాలి ! అనుకునేవారనుకుంటాను. అయితే ఆయన దగ్గర చాలా రకాల గొలుసులున్నాయి కాని...ఆ కుక్కపిల్లను కర్షించే బిస్కత్తు లేకపోయింది. వారి పరిశీలనలో నేను పడ్డాను. నాళ శ్రీముఖం అందింది. ఆదరాబాదరా పరు గెత్తాను.

''మాట్రూ ! బలే అదురుట్టవంతుడివయ్యా !'

నా నోరు ఆ మాటకు చిత్తం అంది.

''మాంచి గుంటకే యేసినావే సూపు !''

''మీరంటు...న్నదేంటో...'' నీళ్ళు నమిలాను.

వారు నవ్వారు. వారి సైను బోర్డులు నవ్వాయి. వారి ముందున్న సీసాల్లో ద్రవం నవ్వింది. వారి సైన్యం నవ్వింది.

''ఓసోసి ! మోళీ గడతన్నాడయ్యామాట్రు !'' పక్కవారితో అన్నారు.

''సర్నేవయ్యా ! యియ్యేల నువ్వయినావు ! నీ సెయ్యి ముం దయినాది! కొత్తోడివయినా గట్టోడివే! మాంచి కేసే పట్టేసావు.''

చాలా తెలివి తక్కువ ప్రశ్న వేసాను ... ''ఎవరి గురించి మాట్లాడుతున్నారు?''

''ఓరి గురించా ! బలే వాడివయ్యా ! ఎంత మందున్నా రేటి ? మూడేల్లబట్టి కాసుక్కూకున్నాను. పంట మాంచి కాపుకి వొచ్చేయాలకే కోసేసుకునావు ! ఆట్టుకెల్తే అట్టుకెల్లుగానీ ... ఓ పస నా గూ్గడా ఒగ్గేసి యెళ్ళు.''

ఆంధ్రపత్రిక

ఆంధ్రపత్రిక ఇప్పటికి ఇంచుమించు ఏడు దశాబ్దాలుగా తెలుగు వారికి సేవ చేస్తోంది.
విజయవాడ మరియు హైదరాబాద్ నుండి వెలువడుచున్నది.

తాజా వార్తలు, పక్షపాతం లేని వ్యాఖ్యలకి ఆంధ్రపత్రిక పెట్టింది పేరు.

ఇవి కాక అన్ని రకాల అభిరుచులనీ సంతృప్తిపరచే ఇతర శీర్షికలు ఎన్నో మీరు ఆంధ్రపత్రికలో చదవగలరు !

★ మనసినిమాలు ★ డాక్టరు కబుర్లు ★ బైస్కోపు కార్టూన్
★ దినవారఫలాలు ★ మా ఊరి సమస్య ★ షాజా
★ ఇది నారీదృక్పథం ★ అయోధ్యాకాండ ★ వింత యదార్థం
★ ఇంకా — దేవీభాగవతం, వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు ... ...

ఎప్పటికప్పుడు ఆంధ్రపత్రికలో సరికొత్త ఆకర్షణలు ప్రవేశపెడుతూనే ఉంటాము !

వెంటనే ఆంధ్రపత్రిక చందాదారుగా చేరండి ! మేనేజరు, ఆంధ్రపత్రిక

ఆపయిన వారు తమ పాత కథలనూ, వీరోచిత కార్యాలనూ ఉగ్గడించారు. పెళ్ళాలనైనా తెచ్చి యివ్వడమే మాస్టర్ల విధి అన్న ధోరణి ప్రదర్శించేరు. ఏ పంతులమ్మలను ఎలా ఎలా వేటాడినదీ సోదాహరించారు.

“ఓపాలి నాకు సూపించి సొంతం చేసుకో! మీ యిద్దరికీ మాంచి వూరేయిస్తాను. నేదంటే మరి...మర్యాదాగుండదు...”

వారు ఆశలు కల్పిస్తే, ‘లొంగను’ అనుకున్నాను. అనునయం చూపితే ‘కుదరదు’ అనుకున్నాను. నీతులు చెపితే ‘దొంగ నీతులు’ అందామనుకున్నాను. వారు అధికారం ప్రదర్శించితే ‘దుర్భరం’ అనుకున్నాను. ఆఖరున వారు సపరివార సమేతంగా తమ క్రూరత్వాన్ని చూపారు.

“యెదవేసాలేస్తే...యిక్కణ్ణుంచెల్లవ్”

నాకు 74 కేజీల బరువుగల శరీరం ఉంది. రక్త మాంసాలతో నిండిన యిరవై అయిదేళ్ళ యవ్వనం నిగ నిగ లాడుతోంది. నలభై రెండంగుళాల ఛాతీ ఉంది. నేను బాలచంద్రుడి గూర్చి, అభిమన్యుడి గూర్చి పిల్లలకు చదువు చెపుతున్నాను. ప్రేయసి కోసం ప్రేమ కోసం త్యాగాలుచేసి మరణించిన అనేక మంది కథలు నాకు తెలుసు. లోకం గొడ్డు పోలేదనీ...అక్కడ అన్యాయాలను ఎదురు కోటానికి ఎల్లప్పుడూ జనం సిద్ధంగా ఉంటారనీ ... నేను ఎంతో మందితో వాదించాను. అయితే ఎల్లప్పుడూ భద్రతనూ, సుఖాన్నీ వాంఛించే నా సంస్కారం...కనీసం ఆలోచనలో గూడా గొడవను, హింసనూ భరించలేని నా వ్యక్తిత్వం...వారికి తిరస్కారపు ధోరణినైనా చూపలేదు. అనవసరపు గొడవల్లో చిక్కుకున్నట్టు; ఎవరి జీవితంలోనో అనవసర ప్రమేయం జరిగినట్లూ...ఫీలయానేమో !!

హైమ అంతా వింది నేను చెప్తుంటే, వింటూన్న ఆమె ముఖంలో ఏ మార్పూ లేదు. దేవీ విగ్రహం ముందు భక్తుడు శ్లోకాలు చదివినా; తిట్లు సాగించినా ఒకటే! ఆమె స్వరూపం యిప్పటికీ గుర్తే ! చంచలమయిన నా ప్రవర్తనలా ముంగురులు ఆమె నుదుటిమీద గాలికి కదుల్తున్నాయి.

హైమ అంది “మధ్యలో నువ్వు చిక్కుకొన్నావు.”

“అవును !” ఆ సమాధానం ఈ నోటినుంచే వచ్చింది.

“అనవసరంగా యిలా జరిగింది కదూ !”

“దొంగ లం ... కొడుకు” తిట్టాను. ‘ఎవరు ?’ అని ప్రశ్నించుకోలేదు.

“చూడు చూడు !”

“ఏమిటి ?”

“ఆ రాయి! అంత నీరు తోస్తున్నా ఎలా వుందో! ఆ యిసక గుట్ట చూడు! నీటిలో ఎలా కరిగిపోతోందో...బలే! బావుంది కదూ !”

ఏమిటింత పిచ్చిగా మాట్లాడుతుంది ? ఎందుకు నాకులా భయపడటం లేదు ? ఈ రకమయిన అనుభవాలు ఈమెకు సామాన్యమయినవా ? యిలాంటి అడవిలో యింతమంది కళ్ళమధ్య యిలాంటి ఏకాంత స్థలాల్లో ఎలా ఉండగలుగుతోంది ? ఈమె నిజంగా పవిత్రమయినదేనా ? ఈమె నన్ను ప్రేమిస్తోందా ? నా కోసం ఏడవదేం ? ఎలా వూరుకోబెట్టాలా అని నేనెంత రిహార్సల్ చేసుకున్నాను ! !

ఆలోచనలు మరలించుకున్నాను కష్టం మీద. నేను మగవాణ్ణి. నా ధర్మం నిర్వర్తించాలి. మంచివాణ్ణి మంచితనం ప్రదర్శించాలి. అందుకు సిద్ధపడుతూ అన్నాను...

“నాతో వచ్చేస్తావా! ఎక్కడికయినా పోదాం !”

అన్నానేగాని భయం ! వస్తుందేమోననే సంకోచం ! మగవాడు ఎప్పుడూ భయపడిపోతూనే ఉంటాడు. ఆడదానివల్ల తనకేదో అన్యాయం జరిగిపోతుందని. అన్యాయమైపోయే ఆడది మాత్రం – నిస్సంకోచంగా, నిర్భయంగా – ఎన్నిసార్లు దగాపడ్డా – మగవాణ్ణి నమ్ముతూనే ఉంటుంది

ఆమెవి పెద్ద పెద్ద కళ్ళు ! ఆకాశాలు ! సముద్రాలు !

“వద్దులే! సర్లేగాని...నే నాయన దగ్గరకు వెళ్ళకపోతే... నీకు అపాయం...”

“చచ్చ ! అంత త్యాగం వద్దు హైమా !”

“మరేం చెయ్యాలి ?”

“ఏమో ! నువ్వే చెప్పు ! ఆలోచించు...”

“ఓపని చెయ్యి! రాత్రికిరాత్రి నువ్వీ వూరునుంచి వెళ్ళిపో!”

“నువ్వు...?” భయం భయంగా అన్నాను.

“నువ్వు లేనప్పుడు నేను లేనూ ! నేనేమవుతాను?”

నేను వెళ్ళిపోతే మాత్రం ... అత నూరు కొంటాడా అన్న ప్రశ్న నాలోనే ఉండిపోయింది. అయినా నేనే వేవో మాట్లాడాను. ఆమె నేను వెళ్ళిపోటానికే ప్రోత్సాహపరిచింది. ఆ రాత్రికి రాత్రే నన్ను ప్రయాణం చేయించింది.

“మంచివాళ్ళకే వస్తాయి కష్టాలన్నీ !” అన్నాను.

హైమ నవ్వింది.

“నువ్వు...నువ్వు కూడా రాకూడదా !”

“ఎందుకులే ! నాన్న ఒక్కడూ అయిపోతాడు.”

ఆ రాత్రి చలిలో... ఆ కొండల మధ్యనుంచి ... నా సామాన్లను మోస్తూ...నాకు దారి చూపిస్తూ ... స్టేషనుకు చేర్చింది. భద్రంగా బండి ఎక్కించింది. ట్రైను కదిలిపోతున్నప్పుడు ... అంతవరకూ ఆమె ఆపుకున్న దుఃఖం కట్టలు తెంచుకున్నట్టుంది. ప్లాట్‌ఫారం కొసవరకూ పరుగెత్తుకు వచ్చి...అక్కడ ఆ స్తంభం దగ్గర ఆ బోర్డు కింద కూలబడి చేతుల్లో ముహాన్ని దాచుకుని... ఏడిచిందేమో !

ఆ దృశ్యం చూస్తూనే...ట్రైనులోంచి బయటకు ఉరకాలనే కోరిక ఒక్క సెకను నా నరాలలో కదిలింది.

చెడ్డవాడి ధైర్యం కన్నా; మంచివాడనబడేవాడి పిరికితనం ఎంత ప్రమాదకరమయినదో ! !

‘సౌందర్యోపాసన’ గూర్చి మాధవ రాసిన ఉత్తరం – నా ఎదురుగా ఉంది.